సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం। 9। మార్చి। 2025



అసెంబ్లీ సాక్షిగా అప్పులపై అసత్యాలు

అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర అప్పులపై కూటమి సర్కార్ నేతలు అసత్యాలతో దొరికిపోయారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహర్ సోమ॥ (ఉ॥)
రాయచోటి	6.29	5.07
రాజంపేట	6.27	5.13
పీలేరు	6.29	5.05
మదనపల్లె	6.30	5.08

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 50 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ఒంటిమిట్టకు టీటీడీ చైర్మన్ రాక

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి ఆదివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రానున్నారు. ఈ విషయాన్ని ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు శనివారం తెలిపారు. మహా సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి సీతారాముల కల్యాణోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని నటేష్‌బాబు తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడు సస్పెన్షన్

పెనగలూరు: పెనగలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ నిమ్మచిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు పెనగలూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఉత్తర్వులు వచ్చాయి. మరోక డాక్టర్ తాసిఫ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం. వైద్యులు సమయానికి విధులకు హాజరుకాకపోవడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేశారు.

నేడు జూడో జట్టు ఎంపికలు

పెనగలూరు: ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పెనగలూరు మండలం, ఇన్ ఫ్యాంట్ జీసస్ స్కూల్ ఆవరణలో జిల్లాస్థాయి జూడో జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. జూని యర్ బాల బాలికల విభాగానికి 2005 నుంచి 2010 లోపు జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఇందులో ఎంపికైన వారు విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో ఈనెల 15, 16వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 98482 67126 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు అవగాహన సదస్సు

కడప కల్చరల్: భారత జాతీయ కళాసంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇన్ టాక్)ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్ టాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నప రెడ్డి వెల్లడించారు. ప్రముఖ ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ ప్రధాన వక్తగా హాజరై ,చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తారని ఆయన వివరించారు. కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తదితరులు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు .ఈ సమావేశంలో కడప ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 240 కేసుల పరిష్కారం



కేసులను విచారణ చేస్తున్న న్యాయమూర్తులు

రాయచోటి టౌన్: రాయచోటి కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు.మొత్తం 240 కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు రూ.1,86,40.095లు అందజేసినట్లు రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి తెలిపారు. రాయచోటి డివిజన్‌లోని అన్ని పోలీసు స్టేషన్ల నుంచి పోలీసు అధికారులు వారి పరిధిలోని కేసుల పరిష్కారం కోసం లోక్‌అదాలత్‌కు వచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఈ. ప్రసూన న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దిగువ పేర్కొన్న అన్నమయ్య జిల్లాకు చెందిన నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగాలలో వివిధ హోదాల్లో నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా రేవతి బీరం జి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా జి. చంద్రమౌళి, రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శిగా వీఎస్ రెడ్డిలను నియమించారు.

వైఎస్సార్ జిల్లాలో..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాలలో వివిధ హోదాలలో నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీలుగా జి. క్రిష్ణవేణిరెడ్డి, మూలే సరస్వతి దేవి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శులుగా ఎం. రామమోహన్‌రెడ్డి, ఎస్. వీర గంగుల వీర ఆంజనేయులు, కార్యదర్శిగా రాయల్‌బాబు, రాష్ట్ర మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా వీవీ సుబ్రమణ్యం రావు, కార్యదర్శులుగా పోచిమరెడ్డి సుబ్బారెడ్డి, ఓ. వేణుగోపాల్‌లను నియమించారు.


ఆశలు ఆవిరి!





కోయకుండా తోటల్లోనే వదిలేసిన బంతిపూలు

- పూల రైతుకు ధరాఘాతం
- పతనమైన బంతి, రబ్బరు చామంతి ధరలు
- కోయకుండానే తోటల్లోనే వదిలివేస్తున్న వైనం
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



గుర్రంకొండ: ఈ ఏడాది పూలసాగు చేపట్టిన రైతులు నట్టేట మనిగిపోయారు. మార్కెట్లో పూల ధరల ఒక్కసారిగా పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో బంతి, రబ్బరు చామంతి ఇతర పూల రకాల ధరలు రూ. 5 లోపే పలుకుతున్నాయి. జిల్లా మొత్తం రూ.20.01 కోట్ల మేరకు రైతులు నష్టపోయారు. మార్కెట్లకు తీసుకెళ్లినా కొనేవారు లేక పోవడంతో అక్కడే వదిలేసి వచ్చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది పండుగలు, ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని రైతులు 1340 ఎకరాల్లో వివిధ రకాల పూలతోటల సాగు చేపట్టారు. మంచి ధరలు వస్తాయని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. పదిహేను రోజుల క్రితం మార్కెట్లో కిలో రూ. 30 నుంచి రూ.40 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం రూ.5లోపే పలుకుతుండడంతో పెట్టుబడి కూడా చేతికొచ్చే అవకాశం లేక రైతులు భారీగా నష్టపోతున్నారు.

ఎకరా సాగుకు రూ. లక్ష ఖర్చు

ఎకరం బంతి పూల సాగుకు రూ.85వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది. ఎకరం పొలానికి 10 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. నర్సరీల్లో 10 వేల మొక్కల ధర రూ.25 వేల నుంచి రూ. 45 వేల వరకు చెల్లించాలి. ఎరువులు, దుక్కులు,కూలీలు, మందులు, పూలకోతవరకు వచ్చే ఖర్చులు కలుపుకొంటే గరిష్టంగా రూ. 85 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు వస్తుంది. ఇదే రబ్బరు బంతిపూల తోటల సాగుకు ఎకరానికి రూ. 1.50లక్షల వరకు ఖర్చు వస్తుంది. మంచి దిగుబడి వస్తే ఎకరానికి ఐదు టన్నుల బంతిపూలు కాస్తాయి. రబ్బరు బంతి అయితే ఎనిమిది టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో బంతిపూల ధర కిలో రూ.4 నుంచి రూ.5వరకు మాత్రమే పలుకుతోంది. ఈ లెక్కన కనీసంపెట్టుబడి ఖర్చులు కూడా చేతికందక పూలతోటలు సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు.

ప్రస్తుత పరిస్థితి: పూలతోటలు మంచి అదనుమీదకొచ్చాయి. ఉగాది పండుగ దగ్గరకొస్తుండడంతో పూల కోతలు మొదలయ్యాయి. ప్రస్తుతం 50 కేజీల పూల బస్తా ధర మార్కెట్లో రూ.200 నుంచి 250 వరకు పలుకుతోంది. జిల్లాలో సాగు చేసే పూలను తమిళనాడు, కర్ణాటకతోపాటు మన రాష్ట్రంలోని వైఎస్సార్ జిల్లా, గుంటూరు, విజయవాడలకు ఎగుమతి చేస్తుంటారు. కోతకూలీలు, రవాణా ఖర్చు కలుపుకొంటే ఒక బస్తాకు రూ.250 నుంచి రూ.300 వరకు ఖర్చు వస్తుంది. దీంతో మార్కెట్‌కు పూలను తీసుకెళ్లే రైతులకు చేతి నుంచి అదనంగా ఖర్చు వస్తోంది. దీంతో పలువురు రైతులు బంతిపూలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. మరికొంతమంది ఉగాది పండుగ, జిల్లాలో మొదలయ్యే పలు జాతర, తిరునాళ్ల పురస్కరించుకొని గిట్టుబాటు ధరలు వస్తాయనే ఆశతో అదనుకొచ్చిన పూలను కోసేసి పొలాల వద్దనే పారేస్తున్నారు.వ్యాపారులు పూలబస్తాలను బెంగుళూరుకు తీసుకెళ్లి అమ్ముడుపోక అక్కడే వదిలేస్తున్నారు. ఓవైపు టమాటా, మరోవైపు వంగ సాగు చేసి నష్టపోగా ప్రస్తుతం పూలసాగు నష్టాలే మిగల్చడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

రూ.20.01 కోట్ల నష్టం



ధర లేక పూలు కోసేసి పారబోసిన దృశ్యం

జిల్లాలో ఈ సీజన్‌లో వివిధ రకాల పూలతోటలు సాగు చేసిన రైతులు రూ. 20.01 కోట్లు మేరకు నష్టపోయారు. ఎకరం సాగుకు పంటరకాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చు వస్తుంది. జిల్లా మొత్తం మీద ప్రస్తుతం కోతకొచ్చిన పంటలు 1340 ఎకరాల వరకు ఉన్నాయి. ఒక్క కోత కూడా కోయకుండా పంటలను అలాగే వదిలేసిన రైతులు 80 శాతం మేరకు ఉన్నారు. మిగిలిన వారు ఒకటి రెండు కోతలు చేసి బెంగుళూరు, చెన్నై మార్కెట్లకు తీసుకెళ్లారు. ఆక్కడ కొనేవారు లేక పూల బస్తాలను వదిలేసి వస్తున్న సంఘటనలు చోటు చేసుకొన్నాయి.

పెట్టుబడి కూడా రావడం లేదు



ఈ ఏడాది బంతిపూలు సాగు చేసి పూర్తిగా మునిగిపోయాం. పదిహేనురోజుల ముందు మార్కెట్లో మంచి ధరలు ఉన్నాయి. ప్రస్తుతం పూర్తిగా పడిపోయాయి. ఎకరం పొలంలో సాగు చేశాను. అన్ని ఖర్చులు కలుకొంటే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలేదు. పూలసాగు నష్టాలే మిగిల్చింది.

– వెంకట్రమణ, పూలరైతు వెంకన్నగారిపల్లె

తోటల్లోనే వదిలేస్తున్నాం



ఎకరం తోటలో బంతి పూలుకోసుకొని మార్కెట్ తీసుకెళితే కనీసం కోతకూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. మార్కెట్లో వ్యాపారులు కూడా బంతిపూల బస్తాలను కొనుగోలు చేయడం లేదు. నష్టాలు భరించలేక తోటలు అలాగే వదిలేస్తున్నాం.

– రమణమ్మ, పూలరైతు, బురుజుగడ్డ

కల్పవృక్ష వాహనంపై నారసింహుడి విహారం



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్పవృక్ష వాహనంపై విహరించారు. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా మూడోరోజైన శనివారం వేకువ జామునే మూలవర్లకు తోమాల సేవ నిర్వహించారు. వాహనమండపంలో వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామివారిని అందులో కొలువుదీర్చి గ్రామపుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు పెద్దశేషవాహనంపై ఊరేగనున్నాడు. అలాగే తిరుచ్చి ఉత్సవం, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయఅర్చకులు గోపాలభట్టర్ తెలిపారు.

రామయ్య గోపురంపై శాస్త్రోక్తంగా స్వర్ణ కలశ ప్రతిష్ట



స్వర్ణకలశంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ కుమార్, అర్చకులు



స్వర్ణ కవచాలతో అలంకరించిన సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయ మహా సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా శనివారం టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విమాన గోపురంపై శాస్త్రోక్తంగా స్వర్ణ కలశాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులకు సహస్రనామ కలశాభిషేకానికి సిద్ధం చేసిన 1001 కలశాలలో పంచామృతాభిషకాలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ కలశాన్ని విమాన గోపురంపై శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి చరుస్థానార్చనము, శ్రీమద్రామాయణ యజ్ఞం, మూర్తి హోమం నివేదన, శాత్తుమొర చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి కళాపకర్షణ, శయ్యాదివాసం, ప్రధాన మూర్తి హోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, శాతుమొర నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, తులసి గజమాలలు, ఆభరణాలతో అలంకరించి ఎదురుకోలు మండపంపై ఆసీనులు చేసి కన్నుల పండుగగా ఊంజల్ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, అర్చకులు శ్రావణ్ కుమార్, సివిల్ విభాగం ఏఈ అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలే మహారాణులు



రాయచోటి: మహిళలతో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మున్సిపల్ చైర్ పర్సన్ మనుజా రెడ్డిని సన్మానిస్తున్న సమన్వయకర్త నిసార్ అహమ్మద్

- అన్ని రంగాల్లోనూ రాణిస్తూ విజయకేతనం
- జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి రాయచోటి: సమాజంలో అన్ని రంగాలలో మహిళలు పురుషుల కంటే దీటుగా రాణిస్తున్నారు.. ప్రతి మగవాడి విజయం వెనుక మహిళ ఉందనడంలో ఎలాంటి సందేహంలేదు.. రాజకీయాలలో శాసించడం మొదలు.. అధికారిగా అందరితోనూ మమేకమవుతూ... కార్మిక, ఉపాధి, గృహిణి, అటవీ, పోలీసు ఇలా చెబుతూ అన్ని విభాగాల్లోనూ మహిళలది ప్రత్యేక స్థానం. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో కేకలు కట్ చేయడంతోపాటు మహిళలను సన్మానించారు. రాయచోటి, రాజంపేట, మదనపల్లె, రైల్వేకోడూరులలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మదనపల్లె పార్టీ ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్‌లు పాల్గొన్నారు.

రాయచోటిలో మహిళలకు సన్మానం

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో పలువురు మహిళలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యంగా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డిలు ముందుగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలచేత కేక్ కట్ చేయించారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మనిషి పుట్టుక నుంచి అంతిమం వరకు అతివ లేకుండా ఏదీ జరగదని కొనియాడారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం రోజున పలువురు వీర మహిళల గురించి తెలియజేశారు. చివరలో మహిళలు వైఎస్సార్‌సీపీ నేతలు ఆకేపాటితోపాటు గడికోట శ్రీకాంత్‌రెడ్డిని కూడా సన్మానించారు.

- రాజంపేటలోని ఆకేపాటి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ప్రముఖ విభాగాలలో పనిచేస్తున్న మహిళలను ఎమ్మెల్యే ఆకేపాటి ఆధ్వర్యంలో సత్కరించారు. అలాగే మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మదనపల్లె మున్సిపల్ చైర్ పర్సన్ మనుజారెడ్డితోపాటు పార్టీలో పలు పదవుల్లో ఉన్న మహిళా నేతలను, ఇతర మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించారు. ఈ సందర్భంగా అక్కడే కేక్ కట్ చేసి పంచిపెట్టి స్వీట్లు పంపిణీ చేశారు. రైల్వేకోడూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు మహిళల ఆధ్వర్యంలో కేకలు కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానం చేశారు. అక్కడే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కూడా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు.

స్త్రీల సాధికారతే ధ్యేయం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి



మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు చెక్కులను అందజేస్తున్న రాష్ట్ర మంత్రి, కలెక్టర్ తదితరులు

రాయచోటి: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాయచోటిలోని నారాయణ ఫంక్షన్ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతల వల్ల రాష్ట్రంలో మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. డ్వాక్రా గ్రూపుల వల్ల ఎంతో మంది మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించగలిగారన్నారు. ఈ ఏడాది మే నెల నుంచి తల్లికి వందనం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 25 వేల లావాదేవీలతో నాణ్యతతో కూడిన వస్తువులను విక్రయం చేసేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్‌కు, జిల్లా యంత్రాంగానికి శుభాభినందనలు తెలిపారు.

భవానీని స్ఫూర్తిగా తీసుకుందాం:కలెక్టర్

జిల్లాలోని మదనపల్లెకు చెందిన భవానీని స్ఫూర్తిగా తీసుకుని మహిళలందరూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ అన్నారు. జీడీపీలో జిల్లా 23వ ర్యాంకులో ఉన్నప్పటికీ జిల్లాలోని మహిళలు డిజిటల్ కామర్స్‌లో ఎంతో ముందున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని మహిళలు చేసిన ఉత్పత్తులను విక్రయం చేసి 25 లక్షల రూపాయల విలువతో 25 వేల లావాదేవీలు జరగడం ఇందుకు ఉదాహరణగా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో లక్షాధికారులుగా మారిన మహిళలను సత్కరించుకోవడం ఆనందదాయకమన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నేడు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 635 ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలకు దాదాపు రూ.90 కోట్ల రుణాలను అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు పీఎంఏజేఏవై పథకం కింద 46 మందికి 76 లక్షల రూపాయల రుణాలను అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 109 మందితో కూడిన ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు 17 కోట్ల రూపాయల రుణాలను అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో 614 మంది మహిళలకు జాతీయ అప్రెంటిస్ శిక్షణ కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభిస్తున్నామని ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు నైపుణ్య అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ కార్యక్రమం ద్వారా 87 మంది మహిళలకు 86 లక్షల రూపాయల రుణాలను అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ,టైలరింగ్ మిషన్లను అందిస్తున్నామన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిలో మహిళల పాత్ర కీలకం: ఎస్పీ

మహిళలు కేవలం కుటుంబపోషణలోనే కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి పాటు పడుతున్నారని వారి భద్రత చాలా ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం శక్తి మొబైల్ యాప్‌ను ఈ రోజు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా మహిళలకు ఎటువంటి అభద్రత ఎదురైనా ఒక బటన్ నొక్కితే పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. డ్రోన్లను మహిళా భద్రత కోసం ఉపయోగించడం ప్రారంభించామన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు ఒక పోలీసును ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి సమాచారమైనా ఆ పోలీస్‌కు తెలుపవచ్చని పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ రోహిణి, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దీప్తి, జిల్లా ఐసీడీఎస్ అధికారి రమాదేవిలు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో మహిళలు అన్ని రంగాలలో ఎంతో ప్రగతి సాధించారన్నారు.

మెమెంటోలు అందజేత

జిల్లాలో వివిధ శాఖలకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, లక్షాధికారులుగా మారిన మహిళలకు మంత్రి, జిల్లా అధికారులు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లి టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి, మదనపల్లెకు చెందిన భవానీ తదితరులు పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమంలో అనధికార నేతలు



వేదికపై మంత్రి, కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఆశీనులైన టీడీపీ నాయకులు

రాయచోటి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంగా నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో అనధికార నేతలు కూర్చోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దీప్తి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రాజు, మంత్రి సోదరులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లి టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి పాలుపంచుకున్నారు. అధికారిక కార్యక్రమంలో ఎలాంటి అధికారిక హోదా లేని నాయకులు పాలుపంచుకోవడం పట్ల కార్యక్రమాన్ని వీక్షించిన ప్రజలు అధికారం మనదైతే అంతా మనమే అన్న రీతిన నడుస్తామన్నట్లు ఉందని గుసగుసలు వినిపించాయి.

క్లుప్తంగా

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

ములకలచెరువు : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ నరసింహుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని దేవులచెరువు పంచాయతీ నీరుగట్టువారిపల్లెకు చెందిన కులాయప్ప మద్యం విక్రయిస్తుండగా సిబ్బందితో దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ. 4,150 విలువజేసే ఆంధ్రా మద్యం స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

బెల్టుషాపు నిర్వహిస్తే చర్యలు :
మండలంలో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరసింహుడు హెచ్చరించారు. ఇప్పటిదాకా మండల వ్యాప్తంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. గ్రామాల్లో అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తే 9440900715 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ వాసులు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల పట్టణానికి చెందిన కొమరయ్య(60), తన భార్య రాజమ్మ(54), పక్షవాతంతో బాధపడుతుండగా, కుమారుడు మహేంద్ర(30), హైదరాబాద్ నగరంలోని ఆల్వాల్‌లో నివాసం ఉన్న కుమార్తె సుజాత (35), అల్లుడు శ్రీనివాస్ (43)లతో కలసి చికిత్స కోసం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం విరుపాక్ష పురానికి కారులో బయలుదేరి వచ్చారు. శనివారం చికిత్స అనంతరం తిరిగి హైదరాబాదుకు పయనమయ్యారు. మార్గమధ్యంలోని మదనపల్లె పుంగనూరు రోడ్డు బైపాస్ మార్గంలో కనుమలో గంగమ్మ గుడి వద్ద వస్తుండగా, డ్రైవింగ్ చేస్తున్న మహేంద్రకు ఫిట్స్ రావడంతో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదంలో రాజమ్మ, శ్రీనివాస్ తీవ్రంగా గాయపడగా కొమరయ్య స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా సీఐ సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు.

వీఆర్వో రూటే సపరేటు

- ఒక్కో డీ పట్టా రూ.50 వేలు
- ప్రభుత్వ భూములను మాయం చేస్తున్న ఘనుడు
- తప్పనిసరి బదిలీల్లో కూడా మండలాన్ని వదలని విక్రమార్కుడు


గాలివీడు తహసీల్దార్ కార్యాలయం

గాలివీడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓ ద్వితీయశ్రేణి అధికారి వీఆర్వో లంచావతారం ఎత్తాడు. ఆయన లీలలు అన్నీ ఇన్నీ కాదు. ప్రభుత్వ భూముల్లో ఒకో డీ పట్టాను రూ.50 వేలకు వేలం వేసి మరీ విక్రయించడం గమనార్హం. పైసలిస్తే చాలు ప్రభుత్వ భూములైనా,పట్టా భూములైనా ఇతరులకు అసైన్ చేయించేస్తాడు. రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి కొనసాగుతున్నా తప్పనిసరి బదిలీల్లో సైతం చక్రం తిప్పి మండలంలో తిష్ట వేశాడు. అసైన్డ్ భూముల్లో అవినీతి,పొజిషన్ సర్టిఫికెట్ల పేరుతో విక్రయాలు,ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసి రైతుల దగ్గర నుండి డబ్బులు గుంజడం, ఇలా ఒకటేమిటి అన్నీ అక్రమాలే జరుగుతున్నాయంటూ ప్రజలు నుంచి పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో గాలివీడు వీఆర్వోగా విధులు నిర్వహించిన ఆయన పక్కనున్న గోరాన్ చెరువు గ్రామంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉండటంతో అక్కడికి మకాం మార్చాడు. ప్రభుత్వ భూములు స్వాహాలో కొన్ని గమనిస్తే గాలివీడు పరిధిలో గుర్రాలమిట్ట వద్ద సర్వే నంబర్ 2286 లో 70 సెంట్ల భూమిని మాయం చెయ్యగా, రాయచోటి ప్రధాన రహదారి పక్కనే ఉన్న వాటర్ ప్లాంట్ వద్ద సర్వే నంబర్ 900బీ1 లోని 85 సెంట్ల భూమిలో మామూళ్లకు కక్కుర్తి పడి 40 సెంట్లు భూమిని వేరొకరి పేరుపై అసైన్ చేయించేశాడు. అలాగే రాయచోటి కదిరి ప్రధాన రహదారి పక్కనే ఉన్న విలువైన పట్టా భూమిని వేరొకరి పేరుపై ఆన్‌లైన్ చేయించాడు. గోరాన్ చెరువు గ్రామంలో మూడు యకరాల వ్యవసాయ భూమి వేరొకరి పెరోపై ఆన్‌లైన్ చేసయించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ పరంగా మండలంలో ఏపని చేయాలన్నా ఆయన్ను ప్రసన్నం చేసుకోవాల్సిందే. లేదంటే పని జరగదు. డబ్బు ముట్టనిదే ఆయన ఏ పనీ చేయరన్న ఆరోపణలు బహిరంగంగానే విన్పిస్తున్నాయి. డీ పట్టాలు కొన్నవారి పేర్లను సైతం రికార్డుల్లో ఎక్కించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన అనుకుంటే రికార్డులను సైతం తారుమారు చేస్తాడన్న విమర్శలున్నాయి. మండలానికి చెందిన కొందరు ప్రైవేటు వ్యక్తులను పెట్టుకుని వారి ద్వారా ప్రభుత్వ భూములను సైతం ఆన్‌లైన్ లోకి ఎక్కిస్తానంటూ వాటికి ఆనుకుని ఉన్న రైతులకు సమాచారం ఇచ్చి ముడుపులు దన్నుకుంటున్నాడని తెలుస్తోంది.ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి ఇలాంటి అవినీతి తిమింగళాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- మామిడి చెట్లు నరికివేత
- అధికారం మాదే..
- అడ్డువస్తే అంతం చేస్తామని బెదిరింపు


మామిడి తోటలో చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : తెలుగుదేశం పార్టీ నాయకుల దౌర్జన్యానికి అడ్డూ అదుపులేకుండా పోతోంది. అధికారం మాది..మమ్మల్ని అడిగేది ఎవరు.. అడ్డొస్తే అంతం చేస్తామంటూ బొమ్మవరం రెవెన్యూ పరిధిలో పది ఎకరాల మామిడితోటలో చెట్లను నరికి అక్రమంగా తరలించారు. బొమ్మవరం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు. 937, 938, 939 పట్టా భూమిని 15 సంవత్సరాల క్రితం సుబ్బరాఘవరాజు అనే రైతు నుండి రాజంపేట మండలం, మునక్కాయలపల్లి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ అనే రైతు కొనుగోలు చేశాడు. ఈ ఘటనపై పృథ్వీరాజ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ పట్టా భూమిని చిట్వేలి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని, కొద్దిరోజుల అనంతరం ఎస్ సుబ్బరాఘవరాజు సతీమణి, పిల్లలు తమకు తెలియకుండా భూమి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. మరో వ్యక్తితో చేతులు కలిపి ఆ భూమిలో ఇంకొక భాగం ఉందని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. అలాగే ముందుకొన్న తనపై రైల్వేకోడూరు కోర్టులో సివిల్ వ్యాజ్యం కూడా వేయించారని, ప్రస్తుతం అధికారం, పలుకుబడి ఉపయోగించి తహసీల్దార్ కార్యాలయంలో నాపేరుపై ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో తొలగించారన్నారు. గత బుధవారం నుంచి పది ఎకరాలలో భూ కబ్జాదారుడు దుగ్గిన చంద్రబాబు నాయుడు, గోపాల్ నాయుడు అనే వ్యక్తులు తమ అనుచరులతో కలిసి పది ఎకరాల మామిడి తోటను నరికి వేశారన్నారు. హైదరాబాదులో ఉన్న తాను విషయం తెలుసుకొని పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, కోర్టులో ఉన్న భూమిలో మామిడి చెట్లు నరికి కోర్టు దిక్కారానికి పాల్పడ్డారన్నారు. పొలంలోకి వస్తే అంతం చేస్తామని బెదిరించినట్లు పృథ్వీరాజ్ వాపోయాడు. కబ్జాదారులపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

వేటగాళ్ల ఉచ్చుకు వ్యవసాయకూలీ బలి


మృతి చెందిన రమేష్‌నాయుడు

గుర్రంకొండ : వేటగాళ్ల ఉచ్చుకు వ్యవసాయకూలీ బలైన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దిగువ కమ్మపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పి. రమేష్‌నాయుడు(48) వ్యవసాయ కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి పనిమీద బయటకు వెళ్లాడు. అయితే రాత్రిళ్లు ఇంటికి రాకపోయేసరికి శనివారం కుటుంబ సభ్యులు గ్రామానికి పక్కనే ఉన్న కొండలు, గుట్టల్లో గాలించారు. చివరగా వ్యవసాయ పొలాల వద్ద గాలిస్తుండగా ఎగువకమ్మపల్లె–కిలారివాండ్లపల్లె గ్రామాలకు మధ్యలో ఉన్న వ్యవసాయ పొలాల్లో విగతజీవుడుగా పడి ఉండటం గమనించారు. చేతులు, కాళ్లు మొత్తం కోసుకుపోయి విద్యుదాఘాతానికి గురైనట్లు ఆనవాళ్లు కనిపించాయి. దీనిపై ఆరా తీయగా అక్కడి సమీప పొలాల్లోనే కొంతమంది వేటగాళ్లు అడవి జంతువులను వేటాడడం కోసం విద్యుత్ తీగెలతో ఉచ్చులు పన్నుతున్నారని అక్కడి రైతులు పేర్కొన్నారు. దీంతో అడవి జంతువులకు కోసం పన్నిన విద్యుత్ తీగల్లో చిక్కుకొని రమేష్‌నాయుడు మృతి చెందాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వాల్మీకిపురం సీఐ ప్రసాద్, ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో బీఫార్మసీ విద్యార్థిని మృతి

తట్టివారిపల్లె చెరువులో మృతదేహం


మృతి చెందిన విద్యార్థిని పూజిత

మదనపల్లె : అనుమానాస్పద స్థితిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లి మండలంలో జరిగింది. సిటియం రోడ్డులోని తట్టివారిపల్లి చెరువులో మృతదేహం తేలియాడడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ తెలిపిన వివరాలిలా... పీలేరు పట్టణం సమీపంలోని బాలంవారిపల్లికి చెందిన ఎం.టి భాస్కర్ కుమార్తె పూజిత (24) మదనపల్లె మండలం, గంగన్నవారిపల్లె లోని కృష్ణచైతన్య నర్సింగ్ కళాశాల లో బీఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతోంది. పట్టణంలోని ప్రశాంత్ నగర్ లోని బాలాజీ పీజీ హాస్టల్లో ఉంటూ రోజు కళాశాలకు వెళ్లి వచ్చేది. అనుమానాస్పద స్థితిలో చెరువులో మృతదేహమై కనబడింది. పోలీసుల సమాచారంతో మదనపల్లికు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, కుమార్తె మృతికి కారణాలను తాలూకా పోలీసులకు వివరిస్తూ ఫిర్యాదు చేశారు. విద్యార్థిని చిన్నాన్న వెంకటేష్ శుక్రవారం రాత్రి పీలేరు కలకడ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి చెందాడు. శనివారం ఉదయం బాబాయ్ అంత్యక్రియలకు వెళ్లడానికి పూజిత మదనపల్లి నుంచి బయలుదేరింది. విద్యార్థిని చదువుకయ్యే ఖర్చులు భరిస్తూ ఆలనా పాలన చూస్తున్న బాబాయ్ మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థిని తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ తెలిపారు.

డిజిటల్ సాధనాలతో విద్యాబోధన


ఉన్నత విద్యామండలి ఆఫీసర్ శ్రీరంగం మాధ్యూను సన్మానిస్తున గురుప్రసాద్

మదనపల్లె : డిజిటల్ సాధనాలతో విద్యాబోధన చేయడం ద్వారా విద్యార్థులకు విషయజ్ఞానం పెరుగుతుందని ఉన్నత విద్యామండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాధ్యూ అన్నారు. పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో రెండురోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీరంగం మాధ్యూ మాట్లాడుతూ బోధన సందర్భంగా వీలైనంతవరకు విద్యార్థుల నుంచి సమాధానాలను రప్పించే ప్రయత్నంచేసి వారి భాగస్వామ్యాన్ని అందులో పెంచడం ముఖ్యమన్నారు. బోధనలో వినూత్న పద్ధతులు వాడాలని, చాక్‌పీస్, మాట్లాడటం కాదని తెలిపారు. స్వీయ, వేగవంతమైన అభ్యాసం విద్యార్థులకు అలవాటు చేయడం చాలా మంచిదన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు, సహ పాఠ్య కార్యకలాపాలు ముఖ్యమని, పరిశోధనలు, వృత్తి సంస్థలు, ఇంటర్న్‌షిప్ మొదలైనవన్నారు. విద్యార్థులకు ముఖ్యంగా నైపుణ్య కోర్సులపై శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీరంగం మాధ్యూను కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, అధ్యాపకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యం

యూనివర్సిటీ ప్రోచాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న చొప్పా అభిషేక్ రెడ్డి, తదితరులు

రాజంపేట : ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగానే అన్నమాచార్య యూనివర్సిటీ వెళ్తోందని యూనివర్సిటీ ప్రొచాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి అన్నారు. శనివారం అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు కోడ్‌క్రాఫ్ట్ హాకథాన్‌లో విజయం సాధించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్‌ట్రూ సంస్థ నుంచి లక్ష రూపాయలు బహుమతి, ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ రాజంపేటకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన కోడ్ క్రాఫ్ట్ హాకథాన్‌లో పాల్గొన్నారని, హ్యాండ్‌రైటింగ్ రికగ్నిషన్ సిస్టమ్ అనే ప్రాజెక్టును రూపొందించి ప్రతిభను చాటారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ పద్ధతులను ఉపయోగించారన్నారు. ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయడం ద్వారా ఆటోమేటెడ్ హ్యాండ్ రైటింగ్ గుర్తింపు వ్యవస్థను సమర్థవంతంగా రూపొందించారన్నారు. హాకథాన్‌లో కొత్త సమస్యలను పరిష్కరించే సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం, కోడింగ్ నైపుణ్యాలను మెరుగుపరచడం అభినందనీయమన్నారు. సృజనాత్మక ఆలోచలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. కోడ్‌ట్రూ సంస్థ ఈ హాకథాన్‌ను సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి రంగాలలో నైపుణ్యం కలిగిన యువప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించిందన్నారు. ఈ సంస్థకు టాంపా, చికాగో, హైదరాబాద్ నగరాల్లో కార్యాలయాలు ఉన్నాయన్నారు. కోడ్‌ట్రూ ఉత్తమ టెక్నికల్ నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి పరిశ్రమ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తమ కళాశాల విద్యార్థులు హాకథాన్‌లో ప్రథమ స్థానం సాధించడం గర్వకారణమని వారన్నారు. విజేతల బృందం సభ్యులు కున్ననన్ రెడ్డి, చిట్టేపు ఆనంద గోపాల్ రెడ్డి, మానే యనమల అఖిల్ కుమార్ రెడ్డి, గుబగుండ మహేంద్ర, మేక మనోజ్‌లు ఉన్నారని, వీరి ప్రతిభను గుర్తించి కోడ్ ట్రూ సంస్థ లక్ష రూపాయలు నగదు బహుమతిని అందజేసిందన్నారు. అంతే కాకుండా ఈ విద్యార్థులకు సంస్థ నుంచి ఉద్యోగ అవకాశాలు కూడా ప్రకటించిందన్నారు. తమ కళాశాల విద్యార్థులు హాకథాన్‌లో ప్రదర్శించిన సాంకేతిక నైపుణ్యాన్ని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా గుర్తించి, అధిక వేతనంతో ఉద్యోగ అవకాశాలను కల్పించిందన్నారు. కార్యక్రమంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఈ సాయిబాబా రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం సుబ్బారావు. డాక్టర్ బి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


డిల్లీబాబు (ఫైల్)


వెంకటేష్ (ఫైల్)

కేవీపల్లె : మండలంలోని మహల్ క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు, పాల వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో శుక్రవారం రాత్రి ఇద్దరు దుర్మరణం చెందిన విషయం విదితమే. ఎస్ఐ చిన్న రెడ్డెప్ప కథనం మేరకు వివరాలిలావున్నాయి. చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన డిల్లీబాబు (33), అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నీలకంఠరావుపేటకు చెందిన టి. వెంకటేష్ (23) ఇద్దరూ పూతలపట్టు తేజస్ పాల డెయిరీ వ్యాన్‌కు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పాల వ్యాన్‌తో పీలేరు నుంచి కలకడ వైపు బయలుదేరారు. అయితే మార్గంమధ్యలో మహల్ క్రాస్ వద్ద రాయచోటి నుంచి చెన్నై వెలుతున్న ఆర్టీసీ బస్సు, పాలవ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో డిల్లీబాబు, వెంకటేష్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన హాస్టల్ విద్యార్థి అప్పగింత

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఎస్సీ హాస్టల్ నుంచి అదృశ్యమైన విద్యార్థి మదనపల్లెలో ఉండగా గుర్తించి హాస్టల్‌కు అప్పగించారు. వివరాలిలావున్నాయి. గ్యారంపల్లె ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న 8వ తరగతి విద్యార్థి వికాష్ శుక్రవారం హాస్టల్ నుంచి బయటకు వెళ్లి కనబడలేదు. దీంతో ఆందోళన చెందిన హాస్టల్ సిబ్బంది బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చుట్టూ పక్కల గాలించినా కనబడలేదు. విషయం తెలుసుకున్న సోషియల్ వెల్ఫేర్ డీడీ జయప్రకాష్ శనివారం హాస్టల్‌ను సందర్శించారు. ఇదే సమయంలో మదనపల్లెలో విద్యార్థి ఉన్నట్లు వారి బంధువులు గుర్తించి గ్యారంపల్లెకు తీసుకొచ్చి అప్పగించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందిని డీడీ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా..చిన్నారి మృతి

రామాపురం : మండల పరిధిలోని 40వ నెంబరు జాతీయ రహదారిలోని పాలన్నగారిపల్లె సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండకు చెందిన పాలకొండరాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఏపీ03 బిజెడ్ 7792 కారులో పాలకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మార్గంలోని పాలన్నగారిపల్లె సమీపంలో కారుకు కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి కారు బోల్తా కొట్టింది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా అందులో చిన్నారి దర్శత్‌సాయి (1) మృతి చెందగా, నాగేష్, మౌనిక, పూజిత, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

పెట్రోల్‌తో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

కలకడ : పాతకక్షలతో పెట్రోల్ పోసి నిప్పు అంటించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు .. ఫిబ్రవరి–7వతేదీన కలకడ మండలం, ఎర్రకోటపల్లె పంచాయతీ గొళ్ళపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు సుధాకర్‌పై అదే గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు వేంనారాయణ పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు వేంనారాయణను శనివారం మండలంలోని కోన క్రాస్ వద్ద ఉన్నట్లు గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసిన వారిలో ఎస్ఐ రామాంజనేయులు తోపాటు పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు, రమేష్, పోలీసులు కరుణాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కురబ దేవర ఉత్సవాలు

రామసముద్రం : మండలంలోని మట్లవారిపల్లి గ్రామంలో వెలసిన కురబ దేవర ఉత్సవాలలో భాగంగా శ్రీ ఉజ్జినేశ్వర, శ్రీ సిగరేశ్వర, బీరేశ్వర, భత్తేశ్వరస్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. 13 ఏళ్ల తర్వాత అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో దేవరెద్దును బ్యాండువాయిద్యాలు, పిల్లనగ్రోవి నడుమ ఇంటింటా తీసుకెళ్లి తొలిపూజలు ప్రారంభించారు. దేవరెద్దుకు ఇంటింటా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి గుడారాలు వేసుకున్నారు. ఆదివారం జరిగే దేవర్ల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 11 మంది జూదరుల అరెస్టు
- రూ. 3.24 లక్షలు నగదు, కారు, బైక్ స్వాధీనం

రాయచోటి : రాయచోటి రూరల్ మండల పరిధిలోని సుండుపల్లి మార్గం నుంచి పెమ్మాడపల్లికి వెళ్తున్న రహదారి పరిధిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేశారు. శనివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు ఎస్పీ పార్టీ పోలీసులు దాడి చేసినట్లు తెలిసింది. ఈ దాడిలో 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి రూ. 3 లక్షల, 24 వేలు నగదును, ఒక కారు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లు స్వాధీనం

సుండుపల్లె : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో పెద్ద మాదిగపల్లె సమీపంలో రాత్రి సమయంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలలోకి వెళ్లితే.. శుక్రవారం రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీనీ, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ దైవాదీనంకు అప్పగించినట్లు తెలిపారు. తహసీల్దార్ దైవాదీనం మూడు వాహనదారులకు రూ.15 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

రామాపురం : జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె సీఐ టీ.వి.కొండారెడ్డి సూచలన మేలరకు మండలంలోని చిట్లూరు పంచాయితీ పాలన్నగారిపల్లె దక్షిణ దిశలోని కంప పొందలలో శుక్రవారం రాత్రి జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మండల ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.20,700 నగదు, ఒక కారు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసెంబ్లీ సాక్షిగా అప్పులపై అసత్యాలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర అప్పులపై కూటమి సర్కార్ నేతలు అసత్యాలతో దొరికిపోయారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటిలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలతో కలసి మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసం ప్రజలకు ప్రజలకు ఎన్నైనా చెప్పవచ్చన్నారు. అయితే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తూ, ఎన్నో రకాలుగా గత ప్రభుత్వం పేద ప్రజలకు మేలు చేసినా దానిని కూడా చంద్రబాబు దుష్ప్రచారం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. కోట్లు అప్పు చేసిందని చంద్రబాబు, రూ.14 లక్షల కోట్లు అప్పు చేసిందని బీజేపీ నాయకురాలు పురందేశ్వరీ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అనంతరం తొలి అసెంబ్లీ సమావేశంలో అప్పుల నోట్ వచ్చిందన్నారు. రూ.7.80 కోట్లు ఉంటే అందులో రూ.3.5 కోట్లు గత ప్రభుత్వంలోనే జరిగాయన్న వాస్తవాలను అసెంబ్లీలో ప్రజెంట్ చేశారన్నారు. అయినా కూటమి పార్టీ నేతలు దుష్ప్రచారం ఆపలేదన్నారు. రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారని జగన్ ఆర్థిక విధ్వంసం చేశారని మాట్లాడారన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రాతపూర్వకంగా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అప్పులు రూ.3.5 కోట్లు మాత్రమేనని ధ్రువీకరించిరన్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి అప్పుల్లో 50 శాతం అప్పులు చంద్రబాబు ప్రభుత్వంలో జరిగాయని స్పష్టం చేశారన్నారు. ప్రస్తుతం గద్దెనెక్కి సంవత్సరం అయినా కాలేదు అప్పుడే రూ.1.5 కోట్లు అప్పులు చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయన్నారు. జగన్ రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారని దుష్ప్రచారం చేసినందుకు ప్రజలకు క్షమాణలు చెప్పాలన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఆదాయం తగ్గినా, పేద ప్రజలకు అన్యాయం జరగకుండా అప్పుల బ్యాలెన్స్ షీట్ మెయింటెనెన్స్ చేస్తూనే పాలన సాగించారని తెలిపారు. చంద్రబాబు నాయుడు మాత్రం అప్పుల బండారం బయట పడుతుందనే ప్రజల దృష్టి మరల్చేందుకు రకరకాలుగా పేపర్లలో అసత్యాలు రాయిస్తున్నారన్నారు.

పులివెందులలో ఎవరు చనిపోయినా..
పులివెందులలో ఎవరు చనిపోయినా దానిని వివేకానందరెడ్డి హత్యకు ముడిపెట్టడం ఏమిటని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడున్నది మీ ప్రభుత్వమే కదా.. మీ చేతుల్లోనే సీబీఐ, ఇతర విచారణ సంస్థలు ఉన్నాయి కదా ...వాస్తవాలను ఎందుకు వెలికి తీయలేకపోతున్నారు. జగన్‌కు స్వయాన మేనమామ ఈసీ గంగిరెడ్డి చనిపోతే కూడా వివేకానందరెడ్డి హత్యకు ముడిపెడుతున్నారు. డాక్టర్ అభిషేక్‌రెడ్డి అనారోగ్యంతో కొన్ని నెలలు పాటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ చనిపోతే వివేకానందరెడ్డి హత్యకు ముడి పెట్టడం సరికాదన్నారు. వాచ్‌మన్ రంగన్న అనారోగ్యంతో చనిపోతే కూడా ఎందుకు లింక్‌లు పెడుతున్నారని నిలదీశారు. ప్రజలను పక్కదోవ పట్టించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ బాధ్యతారహితంగా మాట్లాడటం సిగ్గుగా అనిపించలేదా అని ప్రశ్నించారు.